స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం జగన్ పాలన

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 87వ వార్డులో రూ.2.48 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

కూర్మన్నపాలెం: పరిపాలనా రాజధానిగా ఎదుగుతున్న విశాఖ నగరంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. జీవీఎంసీ 87వ వార్డులోని వివిధ ప్రాంతాల్లో సుమారు 2 కోట్ల 48 లక్షల రూపాయలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఏకలవ్య వీధిలో 19.70 లక్షల వ్యయంతో కల్వర్టులు, ముస్లిం వీధి మసీదు పక్కన రోడ్‌లో 19.90 లక్షలతో డ్రెయిన్లు, కణితి తెలకులవీధిలో 18.90 లక్షలతో కమ్యూనిటీ హాలు, కణితి గవరవీధి సీడబ్ల్యూసీ నుంచి గవరవీధి రామాలయం రోడ్‌లో 19.98 లక్షల వ్యయంతో డ్రెయిన్లు, కణితి గవరవీధి సీడబ్ల్యూసీ నుంచి గవరవీధి రామాలయం అవతలి వైపు రోడ్‌లో 19.95లక్షలతో ఎస్.డబ్ల్యూ డ్రెయిన్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. పవన్‌సాయి హాస్పటల్ నుంచి హైవే వరకు 79.43 లక్షల వ్యయంతో ఒక భాగం, మరో భాగంలో 70.57 లక్షల వ్యయంతో మరో భాగం.. మొత్తం రెండు భాగాలుగా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. సీఎం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో వారికి గట్టిగా బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, ఇతర నాయకులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- కొలువుదీరనున్న కనకదుర్గ
- ప్రత్యేకంగా తీర్చిదిద్దిన మండపాలు
- 9 రోజుల పూజలకు ఏర్పాట్లు


బాలచెరువులో దుర్గాదేవి మండపం


దళ్లివానిపాలెం జంక్షన్‌లో ఆకట్టుకుంటున్న మండపం

పెదగంట్యాడ: శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. అలాగే, కనకదుర్గాదేవి కొలువుదీరేందుకు అనువుగా పలు ప్రాంతాల్లో మండపాలను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ఈ నెల 15 నుంచి 24 వరకు ప్రత్యేక పూజలు చేసేందుకు మండలంలోని పలు ప్రాంతాల్లో ఆయా ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి.

గంగవరం గ్రామంలో 20 అడుగుల విగ్రహం

గంగవరం గ్రామంలో ఈ సారి 20 అడుగుల ఎత్తు ఉన్న అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ప్రతీ రోజు విశేష పూజలు, 9 రోజులు తొమ్మిది అవతారాల్లో అమ్మవారిని అలంకరిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. 15న బాలత్రిపుర సుందరిగా, 16న గాయత్రీదేవిగా, 17న లలితాదేవిగా, 18న వైష్ణవిదేవిగా, 19న మహాలక్ష్మీదేవిగా, 20న సరస్వతీదేవిగా, 21న అన్నపూర్ణాదేవిగా, 22న దుర్గాదేవిగా, 23న కాళికాదేవిగా, 24న రాజరాజేశ్వరిగా అమ్మవారిని అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ ఎత్తున అన్నసమారాధనలు నిర్వహించనున్నారు. దసరా రోజున అమ్మవారి విగ్రహాల తిరువీధి ఉత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా

దసరా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి

గాజువాక: శ్రీ పోలమాంబ యూత్ ఆధ్వర్యంలో కణితి రోడ్ గొంతినవానిపాలెం జంక్షన్ వద్ద నిర్వహించనున్న దసరా మహోత్సవాల పోస్టర్‌ను బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భక్తులు దుర్గాదేవి మాలధారణతో ఈ ఉత్సవాలను విజయదశమి వరకు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో యూత్ ప్రతినిధులు సురేష్‌రెడ్డి, మజ్జి జగదీష్, సంతోష్, కనక తదితరులు పాల్గొన్నారు.

185 మందికి వైద్య సేవలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పెదగంట్యాడ: రోటరీ క్లబ్ సమతానగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సమతానగర్‌లో రోటరీ హోమియో క్లినిక్ వద్ద శనివారం అపోలో ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 185 మందికి బీపీ, షుగర్, కంటి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో సేవలందిన వైద్యులను రోటరీ క్లబ్ సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 72వ వార్డు అధ్యక్షుడు సిరట్ల శ్రీనివాస్, నక్క లక్షణరావు, విక్టర్ రాజు, జాన్‌డీస్ సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయదుర్గ ఆలయ వార్షికోత్సవం


అన్నసమారాధన ప్రారంభిస్తున్న యాత కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మి

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు కండిపిల్లివారి వీధిలోని విజయదుర్గ ఆలయ 10వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజల చేశారు. యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి, అండిబోయిన అప్పారావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు తిప్పల దుర్యోధన లక్ష్మి, లావణ్య, శివప్రసాద్, రాము తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల ఔదార్యం

సహోద్యోగి కుటుంబానికి రూ.1.20 లక్షల సహాయం


రామస్వామి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఉద్యోగులు

అక్కిరెడ్డిపాలెం: అనారోగ్యంతో మరణించిన సచివాలయ ఉద్యోగి కుటుంబానికి సహ ఉద్యోగులు ఆపన్న హస్తం అందించారు. గాజువాక జోన్ ఉడా ఫేజ్–2 (1086372) సచివాలయంలో వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్యదర్శిగా విధులు నిర్వర్తించే జోగా రామస్వామి కొద్ది రోజుల క్రితం అనారోగ్యం కారణంగా మరణించారు. దీంతో జీవీఎంసీ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న కార్యదర్శులు రూ.1 లక్ష 20వేల నగదును సమీకరించి, రామస్వామి కుటుంబానికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఎస్. నాగేశ్వరరావు, సత్యనారాయణ పోతుల, భవానీ, ఇబ్రహీం, రజియా బేగం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతి వెలిగించాలి

ఆర్‌జేడీ జ్యోతికుమారి


శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్‌జేడీ జ్యోతి కుమారి


శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

అక్కిరెడ్డిపాలెం: విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతి వెలిగించాలని విద్యాశాఖ ఆర్‌జేడీ ఎం.జ్యోతి కుమారి కోరారు. చిన్నారుల సమగ్ర వికాసానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖలో పని చేస్తున్న చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 120 రోజుల పాటు నిర్వహించిన జ్ఞాన జ్యోతి రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా షీలానగర్‌లోని మిలీనియం స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్జేడీ మాట్లాడారు. మూడు నుంచి ఎనిమిది సంవత్సరాల వయసు గల పిల్లలందరూ తప్పకుండా చదవడం, రాయడం తదితర చతుర్విధ ప్రక్రియలను చేయగలిగేలా చేయడం శిక్షణ ముఖ్య ఉద్దేశమని వివరించారు. శిక్షణలో పాల్గొన్న ప్రతీ ఒక్కరు మండల స్థాయిలో జరిగే శిక్షణ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లకు, ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చి, క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలని కోరారు.

బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యంపై, విద్యపై పూర్వ ప్రాథమిక దశ నుంచి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ఆకాంక్షించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ రాష్ట్ర పరిశీలకుడు పైడి వెంకటరావు, భీమిలి డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, అకాడమీ మానిటరింగ్ అధికారి డాక్టర్ జి.లక్ష్మి, కోనసీమ ఏఎంవో పి.రాంబాబు, కీ రిసోర్స్ పర్సన్లు ఆర్.ఎన్.ప్రసాద్, నిర్మలా కుమారి, హరిణి, తాతాజీ, రమాదేవి, సుచరిత, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమం మరింత ఉధృతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్–3ను జిందాల్‌కు ఇవ్వడాన్ని అంగీకరించబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేస్తున్న దీక్షలు నవంబర్ 8వ తేదీకి 1000 రోజులు అవుతున్న సందర్భంగా చేయనున్న కార్యక్రమాలపై కార్మికులను చైతన్యపరచడానికి పోరాట కమిటీ ఆధ్వర్యంలో విభాగాల వారిగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం జరిగిన సమావేశాల్లో నాయకులు మాట్లాడుతూ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ నుంచి కాపాడటానికి కార్మికులు మరింత సన్నద్ధం కావాలన్నారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలన్నారు. యాజమాన్యం ఉత్పత్తిని తగ్గిస్తూ వైజాగ్ స్టీల్ సహజ మరణానికి దారితీసేలా తీసుకుంటున్న చర్యలను వ్యతిరేకించాలన్నారు. నవంబర్ 8న నిర్వహించనున్న కార్యక్రమాల్లో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు అధికంగా పాల్గొనాలన్నారు. సమావేశాల్లో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, సీహెచ్. నర్సింగరావు, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్, జె.రామకృష్ణ, పి.వి.నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అమృతరావు పోరాటం అజరామరం


అమృతరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోసం తన ప్రాణాన్ని పణంగా పెట్టిన అమృతరావు పోరాటం అజరామరమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. టి.అమృతరావు ఉక్కు ఉద్యమం చేపట్టి 54 ఏళ్లు అయిన సందర్భంగా స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో శనివారం ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద ఉన్న అమృతరావు విగ్రహానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మహనీయుల త్యాగఫలంగా ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం కానివ్వబోమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని నడపడానికి సిద్ధంగా ఉందన్నారు. కొంతమంది ఉద్యమం ముసుగులో వారి రాజకీయ ఉనికి కోసం ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప మాట్లాడుతూ అమృతరావు దీక్ష వల్లే విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పడిందన్నారు. ఉక్కు కర్మాగారం పరిరక్షణకు సమష్టిగా పోరాడాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు మాటూరి శ్రీనివాసరావు, పట్టా రామ అప్పారావు, నీరుకొండ రామచంద్రరావు, వై.టి.దాస్, కర్రి దాలినాయుడు, ఎన్నేటి రమణ, మార్టుపూడి పరదేశి తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల జీవితాలను తాకట్టు పెట్టొద్దు'


975వ రోజు ఉక్కుదీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కుటిల రాజకీయంతో తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలకు కార్మికుల జీవితాలు బలవుతున్నాయని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేసి కార్పొరేట్ కంపెనీలకు కార్మికుల జీవితాలను తాకట్టు పెట్టవద్దని కోరారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో 975వ రోజు, శనివారం స్టీల్‌ప్లాంట్‌కు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తా మని పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని, లేనిపక్షంలో బీజేపీకి వచ్చే ఎన్నికల్లో డి పాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు. భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రధాని మోదీ తన నిరంకుశత్వ పాలనతో ప్రభుత్వరంగ సంస్థలను అన్యాయంగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. దేశంలో సంపద సృష్టించలేని బీజేపీ ప్రభుత్వానికి అమ్మే హక్కు మాత్రం ఎవరిచ్చా రని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఆలిండియా కబడ్డీ పోటీలకు గంగవరం క్రీడాకారుడు


కారి లక్ష్మణరావు


పెదగంట్యాడ: న్యూ ఢిల్లీలో ఈ నెల 16 నుంచి 20 వరకు నిర్వహించనున్న ఆలిండియా కబడ్డీ పోటీలకు గంగవరం గ్రామానికి చెందిన కారి లక్ష్మణరావు ఎంపికయ్యారు. ఉక్కునగరం సెక్టార్–6లో పోస్టల్ ఉద్యోగిగా పని చేస్తున్న లక్ష్మణరావు రీజినల్ బోర్డు స్పోర్ట్స్ హైదరాబాద్ తరఫున జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడంపై గంగవరం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రో కబడ్డీ, ఆలిండియా ప్రో కబడ్డీ పోటీల్లో సత్తా చాటిన లక్ష్మణరావు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం అభినందనీయమని విశాఖ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.రాహుల్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ హరి ప్రసాద్, విశాఖ జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జేఎస్‌వీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఉక్కునగరం పోస్టు మాస్టర్ తేజేశ్వరి, ఆదినారాయణ తదితరులు లక్ష్మణరావును అభినందించారు.

యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి పేర్కొన్నారు. అడ్మిషన్స్‌కు సంబంధించి ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 16 నుంచి 22 లోగా ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రాడ్యుయేట్ లెవెల్‌లో బీఎస్సీ ఆనర్స్ మ్యాథమెటిక్స్, బీఎస్సీ ఆనర్స్ ఫిజిక్స్, బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ ఆనర్స్ కెమిస్ట్రీ, బీఎస్సీ ఆనర్స్ బోటనీ, బీఎస్సీ ఆనర్స్ జువాలజీ, బీఎస్సీ ఆనర్స్ మైక్రోబయాలజీ, బీఏ ఆనర్స్ హిస్టరీ, బీఏ ఆనర్స్ ఎకనామిక్స్, బీఏ ఆనర్స్ పొలిటికల్ సైన్స్, బీ.కాం జనరల్, బీబీఏ లాజిస్టిక్స్, బీబీఏ హోటల్ మేనేజ్‌మెంట్, బీబీఏ హెల్త్‌కేర్, డిజిటల్ మార్కెటింగ్‌తో పాటు 12 పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు, ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ తెలుగు, ఎంఏ ఇంగ్లిషు, ఎంఏ సోషల్ వర్క్, ఎం.కాం, ఎంఎస్సీ మ్యాథమెటిక్స్, మైక్రోబయాలజీ, బోటనీ, ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులకు సంబంధించి ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7032270810, 9052297729, 9396235303 నంబర్లలో సంప్రదించాలన్నారు.

క్యాన్సర్ రోగులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- పాలియేటివ్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ విద్యా విశ్వనాథ్
- హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో 'కరేజ్ టు కేర్' సదస్సు


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డాక్టర్ విద్యా విశ్వనాథ్

అగనంపూడి: క్యాన్సర్ వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి పాలియేటివ్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ విద్యా విశ్వనాథ్ సూచించారు. రోగులకు సాంత్వన కలిగించేలా వైద్యులు, సిబ్బంది వ్యవహరించాలన్నారు. వారు బాధ నుంచి ఉపశమనం పొందేలా చూడాలన్నారు. స్థానిక హోమీబాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన కరేజ్ టు కేర్ సదస్సులో ఆమె మాట్లాడారు. రోగులు, సంరక్షకులను గౌరవించే తీరును వివరించారు. ఆస్పత్రి నిరంతర వైద్యవిద్యలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు. హెల్త్ కేర్ ప్రొవైడర్ల శిక్షణలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు డాక్టర్ విద్యా విశ్వనాథ్ తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఆఫీసర్ కుటుంబానికి 'సీ' చేయూత


సాయం అందజేస్తున్న స్టీల్‌ప్లాంట్ సీజీఎం, 'సీ' నాయకులు

ఉక్కునగరం: ఆపదలో ఉన్న స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉన్నతాధికారి కుటుంబానికి ఉక్కు అధికారుల సంఘం (సీ) తమ వంతు సాయం అందజేసింది. స్టీల్‌ప్లాంట్ మార్కెటింగ్ విభాగం జీఎంగా విధులు నిర్వహించిన ఆర్.కృష్ణన్ 1991లో పదవీ విరమణ చేశారు. ఆయన కొన్నేళ్ల క్రితం మరణించారు. ఆయన భార్య తన ఏకైక కుమార్తె, అల్లుడిపై ఆర్థికంగా ఆధారపడ్డారు. అల్లుడు క్యాన్సర్‌తో గతేడాది తుదిశ్వాస విడిచారు. ఈ ఏడాది శ్రీమతి కృష్ణన్‌ను బ్రెస్ట్ కేన్సర్ రావడంతో దానికి ఆమె చికిత్స చేయించుకుంటున్నారు. వారి కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలిసి ఉక్కు అధికారుల సంఘం రూ.50 వేలు సాయం అందజేసింది. కార్యక్రమంలో హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీ, సీ నాయకులు కాటం చంద్రరావు, కె.వి.డి.ప్రసాద్ పాల్గొన్నారు.

సాయానికి 'సీ' వినతి

కృష్ణన్ కుటుంబానికి ఉక్కు ఉద్యోగులు సహృదయంతో సాయం అందించాలనీ 'సీ' ప్రతినిధులు కోరారు. సాయం చేయదలచిన వారు లక్ష్మీ కృష్ణన్, కెనరా బ్యాంక్, అకౌంట్ నం. 110147463026, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ సీఎన్ఆర్‌బీ 0013582కు పంపాలని వారు విజ్ఞప్తి చేశారు.

న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌లో స్వచ్ఛభారత్


పోలీస్‌స్టేషన్‌లో చెత్త తొలగిస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ: న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐలు మన్మథరావు, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది శ్రమదానం చేశారు. స్టేషన్ ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. స్టేషన్ భవనాన్ని శుభ్రం చేశారు. అలాగే స్టేషన్ ఆవరణలో ఉన్న వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఒకచోట చేర్చారు. అనంతరం అక్కడి చెత్తాచెదారాన్ని కాల్చివేశారు.

ఘనంగా హిందీ పక్షోత్సవాలు

సింధియా: తూర్పు నావికాదళ సాముద్రిక ఆడిటోరియంలో శనివారం హిందీ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. నావికా హెడ్ క్వార్టర్స్ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్(ఆపరేషన్స్) రియర్ అడ్మిరల్ మనీష్‌శర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని వార్షిక హిందీ మ్యాగజైన్ పూర్వివాణి 29వ ఎడిషన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ భాష, సంస్కృతిని ప్రోత్సహించడంలో పూర్వివాణి మ్యాగజైన్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం హిందీలో అధికారిక కార్యక్రమాలను నిర్వహించడంలో విశేష కృషి చేసిన వివిధ యూనిట్లకు రాజభాషా పురస్కారాలు అందజేశారు.

ఆత్మనిర్భర్ భారత్ వైపు పురోగమించాలి

- డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ శ్రీనివాసరావు
- ఎన్ఎస్‌టీఎల్‌లో ముగిసిన శిక్షణ తరగతులు


కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్

గోపాలపట్నం: పరిశ్రమ 4.0 కాన్సెప్ట్‌ను అనుసరించి ఆత్మనిర్భర్ భారత్ వైపు పురోగమించాలని విశిష్ట శాస్త్రవేత్త డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్(నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్) వై.శ్రీనివాసరావు అన్నారు. ఎన్ఎస్‌టీఎల్‌లో పరిశ్రమ 4.0 కాన్సెప్ట్ అప్లికేషన్స్‌పై ఐదు రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఆర్‌డీవో, దేశాభివృద్ధి కోసం ఉద్యోగులంతా ఆధునిక నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలన్నారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ క్రమ పద్ధతిలో ప్రాజెక్టు పూర్తికి పరిశ్రమ 4.0 దోహదపడుతుందన్నారు. అత్యంత ప్రయోజనకరమైన ఈ కోర్సులో స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, ఆడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, అగ్‌మెంటెడ్ రియాలిటీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త, ఎఫ్ కోర్సు డైరెక్టర్ ఎస్.మధుకిరణ్, శాస్త్రవేత్త, జీ టెక్నాలజీ డైరెక్టర్ కేదార్‌నాథ్, ఐఐటీ, పలు వర్సిటీలు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం : చక్రధర్‌పూర్ డివిజన్, రూర్కెలా స్టేషన్ పరిధిలో జరుగుతున్న భద్రత పనుల నిమిత్తం సోమవారం(ఈ నెల 16వ తేదీ) జగదల్‌పూర్–రూర్కెలా(18108) ఎక్స్‌ప్రెస్, గుణుపూర్–రూర్కెలా(18118) రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

ప్రయోగాత్మక హాల్ట్ : ప్రయాణికుల సౌకర్యార్థం రూర్కెలా–జగదల్‌పూర్–రూర్కెలా(18107/18108) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 16వ తేదీ నుంచి బ్రహ్మ స్టేషన్‌లో ప్రయోగాత్మక హాల్ట్ కల్పిస్తున్నట్టు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

నేడు బెంగళూరు–హతియా వన్ వే స్పెషల్

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎస్ఎంవీ బెంగళూరు–హతియా(06503) వన్ వే స్పెషల్‌ను నడుపుతున్నారు. ఈ రైలు బెంగళూరులో ఆదివారం ఉదయం 8.50 గంటలకు బయల్దేరి ఆదే రోజు అర్ధరాత్రి 2.35 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 2.40 గంటలకు బయల్దేరి సోమవారం సాయంత్రం 5.45 గంటలకు హతియా చేరుకుంటుంది.

పోలీసుల అదుపులో ఏడుగురు పేకాటరాయుళ్లు

కూర్మన్నపాలెం: బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 27,280 రూపాయల నగదు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని దువ్వాడ పోలీసులకు అప్పగించారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి.. రాజీవ్‌నగర్ సమీప యాతపాలెంలో జనసంచారం లేని బహిరంగ ప్రదేశంలో పేకాటడుతున్నారనే సమాచారం మేరకు ఏసీపీ త్రినాథ్ ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ రాధాకృష్ణ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణా కళాశాల అధ్యాపకుడు 'పోలా'కు ప్రధాని ప్రశంస


అధ్యాపకుడు పోలా ఉమామహేశ్వరరావు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంస్కృతం అధ్యాపకుడు డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నుంచి ప్రశంసలు పొందారు. పరీక్షా పే చర్చ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సూచనలు చేసినందుకు పోలాను ప్రధాని అభినందిస్తూ కళాశాలకు ప్రశంసాపత్రాన్ని పంపించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. 'మీ భాగస్వామ్యం మీ పిల్లల భవిష్యత్తు పట్ల మాత్రమే కాకుండా మన యువతరం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై మీ చిత్తశుద్ధి ప్రతిబింబిస్తుంది'అని ప్రశంస పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావును అధ్యాపకులు అభినందించారు.

కార్మికుల జీతాలు చెల్లించాలి

గాజువాక: మలేరియా విభాగంలో పని చేస్తున్న కార్మికులకు జీతాలను వెంటనే చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గాజువాక ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు డిమాండ్ చేశారు. మలేరియా కార్మికులతో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మలేరియా కార్మికులకు ఏడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, దీనివల్ల వారి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని పేర్కొన్నారు. ఆప్కోసలో విలీనం కాకముందు జీతాల బకాయిలు కూడా ఇప్పటివరకు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఈ దసరానాటికైనా జీతాలను, బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు చిన్నారావు, వెంకటేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.